"ఎక్కడికొస్తున్నారు?"

"తాళం చేతులు ఇవ్వటానికి"

"దానికోసం లోపలకు రానక్కర్లేదు"

"నిజం చెప్పాలంటే నేను దాని కోసం రాలేదు"

"మరి?"

"మీ కోసం" ఆమె చెయ్యి పట్టుకుని చటుక్కున దగ్గరకు లాక్కున్నాడు. అతని కౌగిట్లో ఇమిడిపోయిందామె.

"ఏయ్! ఏమిటిది?" అంది రోషంగా.

"నాంది అంటారు దీన్ని! తరువాత ప్రస్తావన...."

అతని చేతుల్ని విదిలించుకోబోయింది.

"గంగాభవానిగారూ!" అంటూ లోపలకు రాబోయిన పక్కింటి కమల ముఖం ఎర్రగా చేసుకుని వెనక్కు తిరిగి పరుగెత్తింది.

సురేష్ చటుక్కున ఆమెను వదిలేశాడు.

"నాకిలాంటివి నచ్చవు" మండిపడుతూ అందామె.

"నిజానికి నాకూ నచ్చవ్-డైరక్ట్‌గా అసలు విషయంలోకెళ్ళటమే నేనూ లైక్ చేస్తాను-కానీ తప్పదు. ఫార్మాలిటీస్."

"తులసిలాంటి అందమైన భార్యను పెట్టుకుని సిగ్గుండాలి"

"ఊ అనండి! తులసిని రేపే వదిలేస్తాను"

"ఆ!" అదిరిపడిందామె.

"అంటే, ఎల్లుండి మళ్ళీ తీసుకొస్తాను లెండి! రోజు విడిచి రోజు" బయటకొచ్చేశాడు.

బ్యాంక్‌లో ఉదయం స్టార్టవ్వాల్సిన ఇంటర్వ్యూ మధ్యాహ్నం రెండింటికి స్టార్టయ్యింది.

"థ్యాంక్యూ!"

"సో యూ లైక్ బ్యాంక్ జాబ్"

"నో! అయ్ లైక్ మాన్స్ జాబ్"

ముగ్గురూ ఉలికిపడ్డారు.

"వాట్ మాన్స్ జాబ్?"

"మాన్స్ జాబ్ టువార్డ్స్ వుమెన్!"

ఒకరికి అర్థమయింది-మిగతా ఇద్దరికీ మతులు పోతున్నాయ్.

"మీరే బ్యాంక్ ఆఫీసర్ అనుకోండి! కొత్త స్కీమ్ ఏమయినా ప్రవేశపెట్టగలరా?"

"ఓ... మనీ సర్క్యులేషన్ స్కీమ్ పద్ధతిలో నా దగ్గర ఇంకో స్కీమ్ వుంది. చాలాకాలం

ఆలోచించి, ఎంతో రీసెర్చ్ చేసి తయారుచేశాను."

"ఏమిటిది?"

"ఉమెన్ సర్క్యులేషన్ స్కీమ్" మళ్ళీ ఉలికిపాటు ముగ్గురిలోనూ!

"వ్వాట్?"

"అవున్సార్! న్యూ డిస్కవరీ. ది ఓన్ లీ స్కీమ్ ఆఫ్ ఇట్స్ కైండ్! ప్రపంచంలో ఎక్కడా ఎవరూ కనిపెట్టలేదు."

"ఏమిటది?"

"ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ సౌభాగ్యం. ఇదే నా స్కీమ్ మోటో! మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లోలాగ ఇందులో డబ్బు ఒక్క పైసా ఖర్చుచేయనవసరం లేదు. నేను పంపే లిస్ట్ తీసుకుని అయిదు కాపీలు తీసి మీ మగఫ్రెండ్స్‌కి పంపండి. తరువాత లిస్ట్‌లో టాప్‌లో వున్న పేరు గల వ్యక్తి చిరునామాకు మీ భార్యను పంపించాలి. ఇలా కొంతకాలం గడిచాక మీ పేరు లిస్ట్ టాప్‌కి చేరుకుంటుంది. మీకు 26,132 మంది స్త్రీలు దొరుకుతారు. టోటల్ హాపీనెస్! చూశారా! మిగతా స్కీమ్స్‌లో లాగానే ఈ స్కీమ్ కూడా అందరూ ఆసక్తిగా ఫాలో అయితేనే ఫలితాలు బావుంటాయ్. ఒకవేళ ఎవరయినా చైన్ తెంపేస్తే-వాడి భార్య వాడికి తిరిగి వచ్చేస్తుంది-హెల్."

"యూ కెన్ గో"

సురేష్ బయటికొచ్చేశాడు.

రోడ్‌మీద ట్రాఫిక్ రద్దీ విపరీతంగా వుంది.

సురేష్ మంచున్నచోట ఓ సిటిబస్ సడెన్ బ్రేకులతో ఆగిపోయింది.

అందులోనుంచి కండక్టర్ ఓ వ్యక్తిని బయటకు తోయగానే బస్ మళ్ళీ స్టార్టయిపోయింది.

అతనిని వెంటనే గుర్తుపట్టాడు సురేష్ .

"ఒరేయ్-డార్క్ డెవిల్!"

డార్క్ డెవిల్ తూలుతూ సురేష్ దగ్గరకొచ్చాడు.

"బాస్టర్డ్ టికెట్‌కి పైసలు లేవంటే బస్ దింపేశాడు" సురేష్ డార్క్‌డెవిల్ భుజంమీద చేయి వేశాడు.

"పద! వెళ్దాం" అన్నాడు ఆప్యాయంగా. ఇద్దరూ ఫుట్‌పాత్ మీద నడవసాగారు.

"ఒరే డార్క్‌డెవిల్! ఏమిట్రా ఈ లైఫ్? ఎంతకాలంరా ఇలా?" జాలిగా అడిగాడు సురేష్ .

"ఇంకొద్ది రోజులేరా! అంతే! ఆ తరువాత అంతా క్లోజ్! వాడి ఆటకట్టు-మన లైఫ్ కట్ అంతే!"

"అంటే?"

"మా ఫామిలీని అన్యాయం చేసి ఆస్తికాజేసిన ఆ దుర్మార్గుల్ని నేను పదలను. మా

పెద్దనాన్ననూ, వాడి కొడుకునీ అందరినీ స్మాష్ చేయడానికి ఒక ప్లాన్ వేశాను."

సురేష్ ఉలిక్కిపడ్డాడు.

"ఏమిటది?" ఆత్రుతగా అడిగాడు.

డార్క్‌డెవిల్ రహస్యంగా అతని చెవిలో మాట్లాడాడు.

"బాంబేలో ఒక గ్యాంగ్‌ని ఎంగేజ్ చేశాను. వాళ్ళకెంత ఇవ్వాలో తెలుసా? లక్ష! అందుకే మాకు మిగిలిన ఒకే ఒక్క ఇల్లు బేరంపెట్టాను, ఇంకో నెలరోజుల్లో అది అమ్మితే లక్ష చేతికి వస్తుంది. రాగానే బాంబే వెళ్ళటమే. అంతే!"

సురేష్‌కి భయం వేసింది.

"పద-వెళ్దాం"

ఇద్దరూ మళ్ళీ నడవసాగారు.

"సురేష్! మగాడికి ఆనందం ఎప్పుడు దొరుకుతుంది?నిజమైన ఆనందం....."

"అమ్మాయి సంతృప్తిగా కళ్ళు మూసుకుని వుంటే ముద్దు పెట్టుకున్నప్పుడు."

"డోంటాక్! అది నీ లాంటి ఇడియట్‌కి. నిజమైన మగాడికి ఆనందం ఎప్పుడు కలుగుతుందో తెలుసా? తన శత్రువుల్ని స్మాష్ చేసినప్పుడు, అందుకే బాంబే గ్యాంగ్‌ని ఎంగేజ్ చేశాను. వాళ్ళెంత ప్రమాదకరమైన మనుషులో తెలుసా? ఢిల్లీలో రష్యన్ ఎంబసీకి చెందినవాడిని పొలిటికల్‌గా వాళ్ళే మర్డర్ చేశారు. బాంబేలో మిలియనీర్స్ యిద్దర్ని ఒకేరోజున వేటాడి చంపారు. రాష్ట్రంలో ఒక మంత్రి కర్టెన్ వెనుక పనులను బయటపెట్టబోయిన ఒక జర్నలిస్ట్‌నీ, ఒక చిన్న పత్రిక ఎడిటర్ని నడిరోడ్డుమీద నరికి పారేశారు.

వాళ్ళకు లక్షరూపాయలంటే లెక్కలేదు నిజానికి. కానీ వాళ్ళ లీడర్‌కి నేనంటే అభిమానం. ఒకసారి బాంబే బార్‌లో నేను గిటార్ వాయిస్తుంటే థ్రిల్ అయ్యారు. అందుకని బేరం లక్షకి సెటిలయిపోయింది. ఒక సారి అతను ఓ.కే. అన్నాడంటే యింక తిరుగులేదనుకో. అవతలివాడెక్కడున్నా, ఏ మూలకెళ్ళినా వెదికి చంపేస్తారు. ప్రస్తుతం మన దేశంలో దాన్ని మించిన డేంజర్ గ్యాంగ్ యింకోటి లేదు. అమెరికా సి.ఐ.ఏ తో కూడా కంటాక్ట్స్ వున్నాయి వాళ్లకు."

డార్క్ డెవిల్ రూమ్‌కి చేరుకున్నారిద్దరూ. డార్క్ డెవిల్ మంచం మీద వాలిపోయాడు బూట్లతోనే.

"ఓ హసీనా జుల్ఫోంవాలీ జానే జహ"

"ఒరే డార్క్ డెవిల్!"

"ఏమిటి?"

"హసీనా ఎక్కడుందిరా ఇప్పుడు?"

డార్క్‌డెవిల్ చటుక్కున మంచం మీద నుంచి లేచి కూర్చున్నాడు.

"తెలీదు, ఎక్కడున్నా ఫర్వాలేదు. ఐ డోంట్ కేర్! ఎందుకో తెలుసా?"

"ఎందుకు?"

"ఇద్దరం కలిసి గడపాలనుకున్న జీవితమంతా వారం రోజుల్లోకి కుదించి హార్స్‌లీ హిల్స్‌లో నాకిచ్చింది. కొండమీద నుంచి బస్‌లో కిందకు దిగేటప్పుడు ఏం చెప్పిందో తెలుసా? 'మనకింక పెళ్ళెందుకు....ఈ వారం ఒకరి గుండెల మీద ఒకరున్నాం. లైఫ్‌లాంగ్ ఒకరి గుండెల్లో ఒకరుంటాము. అంతకంటే దగ్గరుండి మాత్రం సాధించేముంది అంది. ఎంత ఒండర్‌ఫుల్‌గా చెప్పింది? ఎంత కాచి వడబోసి చెప్పింది. అందుకే అయ్ డోంట్ కేర్! హసీనా ఎక్కడయినా వుండనీ... ఎక్కడయినా వుండనీ... గుండెలో యిద్దరం ప్రక్కప్రక్కనే వుంటాం."

గదంతా మాసిపోయిన బట్టలూ, బూజు పట్టిన డార్క్ డెవిల్ లైబ్రరీ, గోడకు స్కూల్ ఫోటోలు, అల్మారాలో బాటిలూ... టేప్‌రికార్డరూ.... వీటి మధ్య డార్క్ డెవిల్....

మళ్ళీ పడుకొని పాట ప్రారంభించాడతను.

"ఓ హసీనా జుల్ఫోంవాలీ"

సురేష్ గది తలుపు దగరకేసి బయల్దేరాడు. చౌరస్తా దగ్గరకు చేరుకొనేసరికి యింకా ఆరగంట టైమ్ మిగిలింది తులసి ఆఫీస్ నుంచి రావటానికి. అప్పటికే జనప్రవాహం పెరిగిపోయింది.

అందంగా, పొడుగ్గా, లావుగా వుందామె. "36.30.34" అనుకున్నాడు సురేష్ .

ఆమె నడక స్లో అయింది. పెదాలమీద చిరునవ్వు. సంథింగ్ ఇంటరెస్టింగ్!

దగ్గరవుతున్నకొద్దీ మరింత స్లో-"బాగున్నారా?" తీయని గొంతు.

సురేష్ ఖంగుతిన్నాడు. ఎవరీమె? ఎప్పుడు చూశాడు? ఎక్కడ చూశాడు?ఆర్డీనరియా ఎక్స్ట్రార్డినరీయా?

"ఓ! చాలా బాగున్నాను-మీరెలా వున్నారు?"

"ఇదిగో-ఇలా" పైట సరిజేసుకుంటూ అంది.

పెదాలతోపాటు కళ్ళు కూడా నవ్వుతున్నాయి. మెదడు పని చేయటంలేదు. వెనక్కు ఎంత బలంగా తరిమినా మొరాయిస్తోంది.

ముందున్న విందు ముఖ్యం దానిక్కూడా. ఇలాంటి సమయంలో ఫ్లాష్‌బాక్‌లోకి వెళ్ళమంటే ఎందుకు వెళుతుంది ?

"ఇప్పుడెక్కడుంటున్నారు?"

"ఇక్కడే-అంటే రోడ్డుమీదని కాదు"

"జాబ్ చేస్తున్నారా?"

"ఓ యస్! ఎవరి దగ్గర ఖాళీ వుంటే వాళ్ల దగ్గర"

"నేనూ యిక్కడే వుంటున్నానిప్పుడు"

"ఓ! చెప్పరేం? అయితే ఇంక సమస్యే లేదు"

"ఏమిటి సమస్య లేదు?" అడిగిందామె అశ్చర్యంగా.

"అదే! అప్పుడప్పుడు ఇలా కలుసుకోవచ్చని"

"ఎందుకు కలుసుకోవటం?"

అతనికి తెలిసిపోయింది-తనింక నటించటం కుదరదు. అయినా మరోసారి ప్రయత్నిస్తే?

"ఎందుకేముందీ? మీరో వూళ్ళో, నేనో వూళ్ళో"

"నేనెవరనుకుంటున్నారసలు?"

"భలేవారే! తెల్సులెండి తెలీకుండా మాట్టాడతాననుకుంటున్నారా?"

"అయితే నా పేరేమిటో చెప్పండి"

"నీరజ"

"ఛీ!"

"సరదాకన్నాను. మీ పేరు సరోజ"

"అలా లాటరీ వేయకండి" నవ్వు.

"అయితే సారీ! దొరికిపోయాను. చెప్పండి మీరెవరో"

"నిజంగా గుర్తు లేదా?"

"మీరు కట్టుకున్న చీర ఇంతకుముందెక్కడో చూసినట్లే వుంది"

"ఏం మళ్ళీ చెంప దెబ్బ కావాలా?" అదిరిపడ్డాడు సురేష్.

అంతవరకూ వెనక్కు వెళ్ళనని మొరాయించిన మెదడు చెంపదెబ్బ అనేసరికి గంటకు వెయ్యి కిలోమీటర్ల వేగంతో వెనక్కు ప్రయాణించి ఆ స్మృతిని లాక్కొచ్చింది.

"మైగాడ్! శోభాదేవా?"

"ఏం, నమ్మకం లేదా?"

"బాడీ పెరిగింది, అందం తగ్గింది, అందుకని...."

"ఇలా రోడ్డుమీద మాట్టాడటమేనా? కూల్‌డ్రింక్ తాగించే ఏర్పాటు వుందా?"

"వెల్‌కం! పదండి"

మతి పోతోంది.